సాక్షి ఖమ్మం

శనివారం । 29 । జూలై । 2023



వీవీపీ ఉద్యోగులకు స్థానచలనం

జిల్లా ప్రభుత్వాస్పత్రికి అనుబంధంగా మెడికల్ కాలేజీ రావడంతో ఇక్కడి వైద్యులు, ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. 8లో



ఓసీల్లో డైరెక్టర్ పరిశీలన

సత్తుపల్లి మండలంలోని సింగరేణి బొగ్గు గనుల్లో డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి పరిశీలించి ఉత్పత్తి, రవాణాపై సూచనలు చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం పొడి వాతావరణం ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి అండర్–14, సీనియర్ పురుషుల, మహిళల అథ్లెటిక్స్ జట్ల ఎంపిక కోసం ఈనెల 30వ తేదీన పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. జావెలిన్ త్రో, 100, 400 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనుండగా, ప్రతిభ కనబర్చిన వారిని వరంగల్‌లో ఆగస్టు 7నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు.

రీజియన్‌లో పలు ఆర్టీసీ సర్వీసులు రద్దు

సంస్థకు రూ.10లక్షల నష్టం

ఖమ్మం మామిళ్లగూడెం: వరద ముంపునకు గురైన ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను శుక్రవారం రద్దు చేసింది. దీంతో రీజియన్‌లో ప్రతిరోజు రావాల్సిన రూ.95లక్షలకు గాను రూ.85 లక్షల ఆదాయమే రావడంతో రూ.10 లక్షల నష్టం ఎదురైంది. కాగా, ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల నుంచి 46 సర్వీసులను రద్దు చేయగా, దూర ప్రాంతాల బస్సులను మాత్రం యథావిధిగా నడిపించారు. భద్రాచలం డిపో నుంచి అత్యధికంగా 18 సర్వీసులను రద్దు చేయగా, కొత్తగూడెం డిపో నుంచి మూడు, సత్తుపల్లి డిపో నుంచి ఎనిమిది, మణుగూరు డిపో నుంచి ఐదు, మధిర డిపో నుంచి రెండు, ఖమ్మం డిపో నుంచి 10 సర్వీసులు తాత్కాలికంగా రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలు



వాల్‌పోస్టర్లతో కోఆర్డినేటర్, ఆర్టీఓ తదితరులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు వచ్చేనెల 10వ తేదీ వరకు గడువు ఉంది. ఈమేరకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, ఆర్టీఓ తోట కిషన్ సూచించారు. ఎక్కువ మంది ప్రవేశాలు పొందేలా ప్రచారం చేస్తున్న క్రమంలో ఆర్టీఓ కార్యాలయంలో పోస్టర్లు అంటించారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారికి అవగాహన కల్పించారు.

బీఏఎస్ ఎంపిక ప్రక్రియ వాయిదా

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా విద్యార్థుల ఎంపిక ప్రక్రియను వాయిదా వేసినట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులను శుక్రవారం ఎంపిక చేయాల్సి ఉన్నా, భారీ వర్షాలతో వాయిదా వేశామని పేర్కొన్నారు. త్వరలోనే ఎంపిక తేదీ వెల్లడిస్తామని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

హైవేకు ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు ఇవ్వండి

కేంద్ర మంత్రికి విన్నవించిన ఎమ్మెల్యే సండ్ర



కేంద్ర మంత్రి గడ్కరీని సన్మానిస్తున్న ఎంపీలు పార్థసారథిరెడ్డి, వద్దిరాజు, ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: ఖమ్మం – అశ్వారావుపేట రహదారిని గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అనుసంధానం చేసేలా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. ఎంపీలు బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్రతో కలిసి శుక్రవారం ఆయన ఢిల్లీలో గడ్కరీకి వినతిపత్రం అందజేశారు. కల్లూరు మండలం లింగాల వద్ద (కల్లూరు – ఊట్కూరు రహదారి పై), వేంసూరు మండలం లింగపాలెం – వేంసూరు (సత్తుపల్లి – విజయవాడ రహదారి) రహదారిపై ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్లు ఇవ్వాలని కోరారు. అలాగే, సతుపల్లి నియోజకవర్గంలోని పినపాక నుంచి తల్లాడ వరకు, కల్లూరుతో పాటు పెనుబల్లి నుంచి లంకపల్లి వరకు, కిష్టారం వై జంక్షన్ నుంచి సత్తుపల్లి వరకు, అక్కడి నుంచి గంగారం వై జంక్షన్ వరకు ప్రమాదాలు జరుగుతున్నందున నాలుగు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సండ్ర విజ్ఞప్తి చేశారు.



బొక్కలగడ్డలోని ఇంట్లో పేరుకుపోయిన బురద నుంచి సామగ్రి తీస్తున్న మహిళ

బురద మేట

మున్నేరు, జిల్లాలోని ఇతర వాగులు, వంకల వరదతో 982 గృహాల్లోకి వరద నీరు చేరింది. ఇందులో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు కూడా ఉన్నాయి. వీటిల్లో వరదనీటితోపాటు బురద కూడా భారీగా మేట వేసింది. వరద తగ్గిన తర్వాత ఇళ్లకు చేరుకున్న బాధితులు బురదను తొలగించేందుకు అవస్థ పడుతున్నారు. అంతేకాకుండా దుర్గంధం వెదజల్లుతుండడంతో సామగ్రి, ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. అయితే, చాలా ఇళ్లలో సామగ్రి తడిసి పనికిరాకుండా పోయింది. కాగా, ముంపు ప్రాంతాల్లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేర్వేరుగా పర్యటించి బాధితులను పరామర్శించారు.

వరద.. బురద

దాదాపు పది రోజుల తర్వాత వరుణుడు శాంతించాడు. గత మూడు, నాలుగు రోజులుగా హోరెత్తిన వర్షంతో జిల్లాలోని పలు ప్రాంతాలను వరద కమ్మేసింది. మున్నేరుకు అనూహ్యంగా వచ్చిన వరద పరీవాహక ప్రాంతాన్ని ముంచింది. 18 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా 30 అడుగులకు వెళ్లిన వరద.. శుక్రవారం తగ్గుముఖం పట్టింది. ఇక జిల్లాలో పాలేరు, వైరా రిజర్వాయర్లలోకి వరదనీరు ఉధృతంగా వచ్చి చేరినా ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగ్గుతోంది. వరదలతో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు మళ్లీ మొదలయ్యాయి. కాఆగా, మున్నేటి వరద ఉధృతిని కాల్వొడ్డులోని బ్రిడ్జి వద్ద రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశీలించారు. వరదల సందర్భంగా జిల్లాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

- శాంతించిన వరుణుడు.. తగ్గిన వరద
- వేగంగా పెరిగి, అదే స్థాయిలో తగ్గిన మున్నేరు
- పాలేరు, వైరా రిజర్వాయర్లలోకి సైతం తగ్గుతున్న ఇన్‌ఫ్లో
- జిల్లాలో నీటమునిగిన 982 ఇళ్లు
- మున్నేటి వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి పువ్వాడ



బొక్కలగడ్డలో వరద ధాటికి కొట్టుకుపోయిన ఓ ఇంటి పైకప్పు

ఒక్కరోజే వేగంగా తగ్గి..

ఖమ్మం సమీపాన మున్నేరు ఒక్కరోజే వేగంగా పెరిగి.. మళ్లీ 24 గంటల్లోనే తగ్గింది. బుధవారం రాత్రి 10 గంటలకు 15 అడుగులు ఉన్న వరద.. గురువారం సాయంత్రం 5 గంటలకు గరిష్టంగా 30.70 అడుగులకు చేరింది. ఆ తర్వాత తగ్గుతూ వచ్చింది. 19 గంటల్లోనే అత్యధికంగా 15 అడుగుల పైన వరద పెరగడంతో ఖమ్మం నగరం, ఖమ్మం



నయాబజార్ కళాశాలలో భోజనం కోసం క్యూ

రూరల్ మండలంలోని పరీవాహక ప్రాంత కాలనీలు ముంపునకు గురయ్యాయి. అయితే, గురువారం సాయంత్రం 6 గంటల నుంచి తగ్గుముఖం పట్టిన మున్నేరు శుక్రవారం రాత్రి 9.30గంటలకు 17.80 అడుగులకు పడిపోయింది. దీంతో 24 గంటలు పాటు నీట మునిగిన కాలనీలన్నీ తేరుకున్నాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు శ్రమించి నీటిలో చిక్కుకున్న 78 మందిని రక్షించాయి. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ ఉదయం నీట మునిగిన ప్రాంతాల్లో పర్యటించారు. అలాగే, ప్రకాష్‌నగర్ బ్రిడ్జి, కాల్వొడ్డు బ్రిడ్జిల వద్ద వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పాలేరుకు తగ్గిన వరద

పాలేరులోకి వస్తున్న వరద ఉధృతి తగ్గుతోంది. పాలేరు రిజర్వాయర్ నీటి సామర్థ్యం 23 అడుగులు కాగా.. ప్రస్తుతం 25.7 అడుగులు ఉంది. ఎగువ నుంచి పాలేరు రిజర్వాయర్‌లోకి 45,584 క్యూసెక్కుల నీరు వస్తోంది. రిజర్వాయర్ గేట్లు ఎత్తి 47,367 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తూ, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా 526 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. అలాగే, వైరా రిజర్వాయర్‌కు వస్తున్న వరద కూడా తగ్గుతోంది. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 19.10 అడుగులు ఉంది. జిల్లాలో 626 చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నాయి.

వరద తెచ్చిన నష్టం

మున్నేరు సహా వాగులు, వంకలు పొంగి పొర్లడంతో జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆస్తి నష్టం జరిగింది. 80 వరకు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. పదిహేను ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. రెండిళ్లు పూర్తిగా, ఎనిమిది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. తొమ్మిది పునరావాస కేంద్రాల్లో 2,550 మందికి పునరావాసం కల్పించారు. ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలంలో తాగునీటి సరఫరాకు మూడు రోజులుగా బ్రేక్ పడింది. ప్రస్తుతం వరద ఉధృతి తగ్గడంతో శనివారం నుంచి తాగునీరు సరఫరా చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది.



పద్మావతి నగర్‌లోని ఓ ఇంట్లోకి చేరిన చెట్లు



వెంకటేశ్వరనగర్‌లోని ఓ ఇంటి ఎదుట చేరిన బురద



వరద భయంతో వెళ్తున్న స్థానికులు

వరదను సమర్థంగా ఎదుర్కొన్నాం..



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే కందాల, కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ తదితరులు

- అధికారులు, ప్రజాప్రతినిధులు అద్భుతంగా పనిచేశారు
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పాకాల, ఆకేరు, మున్నేరు పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో ఖమ్మంను వరద ముంచెత్తిందని.. 24 గంటల్లోనే మున్నేరులో 30 అడుగులకు నీళ్లు చేరినా అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పని చేసి వరదను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం టీటీడీసీలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నేరుకు 5 లక్షల క్యూసెక్కుల నీరు వేగంగా చేరినా, అంతే వేగంగా తగ్గుతోందన్నారు. 26 అడుగులు దాటి వరద ఎన్నడూ రాకపోగా, ఇప్పుడు 30 అడుగులకు పైనే వచ్చిందని చెప్పారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు, మేయర్, కేఎంసీ కమిషనర్, కార్పొరేటర్లు, ప్రతీ అధికారి, సిబ్బంది అద్భుతంగా పనిచేశారని కితాబునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం వెళ్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని ఖమ్మం తీసుకొచ్చి ఆరు నెలల పాప నుండి వృద్ధుల వరకు రక్షించామని చెప్పారు. కాగా, మున్నేరులో గల్లంతై సతీష్ మృతిచెందడం దురదృష్టకరమని, ఆయన రెండు సార్లు వెళ్లగా మూడోసారి అధికారులు అడుడ చెప్పినా వెళ్లి ప్రాణాలు కోల్పోయాడని మంత్రి తెలిపారు.

గోదావరికి 20 లక్షల క్యూసెక్కుల వరద

భద్రాచలం వద్ద గోదావరిలోకి 20 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని మంత్రి పువ్వాడ తెలిపారు. ఇప్పటికే రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు భద్రాచలంలో ఉన్నాయని, ఇప్పుడు ఖమ్మంలో ఉన్న బృందాన్ని కూడా తీసుకెళ్తున్నట్లు మంత్రి చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రజల ప్రాణాలు సురక్షితంగా ఉండాలని ఆదేశించారన్నారు. భద్రాచలంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఈ వరదలతో జిల్లావ్యాప్తంగా 982 గృహాలు ముంపునకు



ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని సన్మానించిన మంత్రి

గురికాగా, 2,550 మందిని తొమ్మిది పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీపీ విష్ణు ఎస్.వారియర్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్త, జలవనరుల శాఖ సీఈ శంకర్ నాయక్, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని మంత్రి ఆధ్వర్యాన సన్మానించారు.

మున్నేరును పరిశీలించిన మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కాల్వొడ్డు వద్ద రాష్ట్ర మున్నేటి వరదను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం ఉదయం పరిశీలించారు. పరిస్థితులపై అధికారులను ఆరా తీసిన ఆయన ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో తప్ప ఇతర మార్గాల్లో రాకపోకలు పునరుద్ధరించాలని ఏసీపీ బోస్‌ను ఆదేశించారు. కాగా, మున్నేరు వరద పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన మంత్రి.. వరద ప్రభావం తగ్గిన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తూ ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు సేవలందించాలని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే ముప్పు

ముంపు ప్రాంతాలను పరిశీలించిన సీఎల్పీ నేత భట్టి

ఖమ్మం సహకారనగర్: భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. భారీ వర్షాలతో ఖమ్మంలో ముంపునకు గురైన ప్రాంతాలను శుక్రవారం భట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. నగరంలోని మున్నేరు వాగు వద్ద వెంగళరావు కాలనీలోని ప్రజల బాధను కళ్లారా చూశానన్నారు. ఇప్పటివరకు అధికారులు ముంపు బాధితులను భరోసా కూడా కల్పించకపోవడం బాధాకరమన్నారు. అధికార యంత్రాంగాన్ని ప్రజల కోసం పనిచేసేలా



ముంపు ప్రాంతాల్లో పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

చూడాలని సీఈఎం కేసీఆర్‌కు భట్టి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ముంపునకు గురైన అన్ని ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.

ఊరూవాడ గోదావరే..



భద్రాచలం అర్బన్: భద్రగిరి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

భద్రాచలం వద్ద ప్రమాదకర స్థాయిలో వరద ప్రవాహం

- ఈ ఏడాది తొలిసారి మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- వరద నీటితో ఏజెన్సీలోని పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పునరావాస శిబిరాలకు ముంపు బాధితుల తరలింపు
- మరో 24గంటలపాటు తీరం వెంట హైఅలర్ట్

భద్రాచలం: ఊహించినట్టుగానే భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఈ ఏడాది తొలిసారిగా మూడో ప్రమాద హెచ్చరికను దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వచ్చిన గోదావరి ఎగువన కురిసిన వర్షాలతో ప్రాజెక్టుల నుంచి వరద నీటిని విడుదల చేస్తుండగా భద్రాచలం వద్ద రాత్రి నది నీటిమట్టం 53 అడుగులను దాటింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయడంతోపాటు హైఅలర్ట్ ప్రకటించారు. లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. మరో 24 గంటలపాటు గోదావరి తీరం వెంబడి ప్రాంత ప్రజలను, సిబ్బందిని జిల్లా అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

వేగంగా పెరుగుతున్న వరద

రెండు రోజులుగా స్వల్పంగా పెరుగుతూ, తగ్గుతూ వచ్చిన గోదావరి శుక్రవారం అతి వేగంగా పెరిగి రెండో, మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిని చేరుకుంది. ఉదయం 6 గంటలకు 46.20 అడుగులుగా ఉన్న గోదావరి 10 గంటలకు 11,44,645 క్యూసెక్కుల నీటి ప్రవాహం దిగువకు వెళ్తుండగా, నీటిమట్టం 48 అడుగులుగా నమోదైంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అంతే వేగంగా పెరుగుతూ వచ్చిన గోదావరి సాయంత్రం 5 గంటలకు 51.40 అడుగులు, రాత్రి 9గంటలకు 53.10 అడుగులను చేరుకుంది. దీంతో మూడో అధికారులు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాగా, అర్ధరాత్రి 12 గంటలకు 53.60 అడుగులతో 14,54,937 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

మరో 24 గంటలు హైఅలర్ట్

ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి వరద నీరు ఇంకా వచ్చే అవకాశం ఉండటంతో మరో 24 గంటలు గోదావరి తీర ప్రాంతాల వెంబడి అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సుమారు 2లక్షల 58 క్యూసెక్కులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 9 లక్షల 11 వేలు, మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి 13 లక్షల 17వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీరు శుక్రవారం అర్ధరాత్రి లేదా శనివారం ఉదయంకల్లా భద్రాచలం చేరుకునే అవకాశం ఉందని, దీంతో 58 అడుగుల నుంచి 60 అడుగుల వరకు నీటిమట్టం పెరుగుతుందని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాల్లోని ముంపు గ్రామాల ప్రజలను ట్రాక్టర్ల ద్వారా పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 30 రెవెన్యూ గ్రామాల నుంచి 1,523 కుటుంబాలకు చెందిన 4,687 మందిని పునరావాస శిబిరాలకు తరలించామని అధికారులు వెల్లడించారు.



క్లుప్తంగా

మంత్రిని కలిసిన అదనపు కలెక్టర్లు




మంత్రికి మొక్కలు అందజేస్తున్న అదనపు కలెక్టర్లు మధుసూదన్, అభిలాష

ఖమ్మం సహకారనగర్: ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్(స్థానిక సంస్థలు), డి.మధుసూదన్(రెవెన్యూ) రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను శుక్రవారం కలిశారు. వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా వారు కలిసి పూలమొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్నేరు వరద పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు ప్రవేశపెట్టండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును పార్లమెంట్ ప్రవేశపెట్టడంతో పాటు సెంట్రల్ నోటరీ నియామకానికి సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయాలని ఖమ్మంకు చెందిన న్యాయవాదులు కోరారు. ఈమేరకు తాళ్లూరి దిలీప్‌చౌదరి, సింగం జనార్దన్‌గౌడ్, చంద్రకాని గురుకృష్ణ, సయ్యద్ ఇంతియాజ్ తదితరులు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు.

సత్తుపల్లిలో బాక్స్ క్రికెట్ స్టేడియం



మాట్లాడుతున్న చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు రూ.30 లక్షలతో సత్తుపల్లి మీ–సేవా కేంద్రం ఎదుట బాక్స్ క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌బాల్, త్రోబాల్, క్రికెట్, రబ్బీ క్రీడల్లో రాణించేలా ఈ స్టేడియం నిర్మిస్తున్నామని తెలిపారు. కాగా, పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వర్షాలు తగుముఖం పట్టగానే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇంకా ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గోపా నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం ఇదే..

ఖమ్మం మామిళ్లగూడెం: గౌడ ప్రొఫెషనల్, అఫీషియల్స్(గోపా) జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గోపా జిల్లా అధ్యక్షుడిగా గుడిద శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శిగా మరికంటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కప్పల మధుగౌడ్‌ను ఎన్నుకున్నారు. అలాగే, ఉపాధ్యక్షులుగా డాక్టర్ సురేందర్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, చెన్నారావు, కిషోర్, రాజ్యలక్ష్మి, నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకట్, సంయుక్త కార్యదర్శులుగా పోతగాని వెంకన్న, లక్ష్మణ్, మందప్రసాద్, వీరబాబు, ఝాన్సీ, కార్యవర్గ సభ్యులుగా వెంకటాద్రి, చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ బొల్లికొండ శ్రీనివాస్‌గౌడ్, కన్వీనర్‌గా మార్కం లింగయ్యగౌడ్ ఎన్నికయ్యారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	19,700	13,500
ఏసీ మిర్చి	24,000	18,500
పత్తి	7,150	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,623

వీవీపీ ఉద్యోగులకు స్థానచలనం

- పెద్దాస్పత్రి నుండి బదిలీ కానున్న 199 మంది
- ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో నిర్ణయం
- జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో ఆప్షన్లు ఇస్తున్న ఉద్యోగులు



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి

ఖమ్మం వైద్యవిభాగం: సుదీర్ఘ కాలం తర్వాత వైద్య విధాన పరిషత్(వీవీపీ) పరిధిలోని ఉద్యోగులకు స్థానచలనం కలగనుంది. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు, పారామెడికల్, నర్సింగ్, నాలుగో తరగతి, మినిస్టీరియర్ సిబ్బందిని బదిలీకి రంగం సిద్ధమైంది. ఈమేరకు వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దాస్పత్రి నుండి పూర్తిస్థాయిలో ఉద్యోగులను జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో బదిలీ చేయనుండగా, వారు ఆప్షన్స్ ఇస్తున్నారు.

మెడికల్ కాలేజీ మంజూరుతో..

ఖమ్మం జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైంది. పాత కలెక్టరేట్, ఆర్అండ్‌బీ, పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయం స్థలాలను కలుపుకుని మెడికల్ కళాశాల ఏర్పాటు చేయనుండగా, పనులు చివరి దశకు చేరాయి. ఈ విద్యాసంవత్సరమే 100 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయనుండడంతో నీట్ ర్యాంకర్లకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈమేరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్లడంతో క్రమంగా మెడికల్ కాలేజీలో కావాల్సిన ఉద్యోగులను భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే ఆరుగురు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, 23మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 27మంది సీనియర్ రెసిడెంట్లు, ఐదుగురు హౌస్ సర్జన్లు, 15మంది డీఆర్‌పీలను కేటాయించారు. మరో 60 మంది సీనియర్ రెసిడెంట్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది త్వరలో రానున్నారు.

199 మందికి స్థానచలనం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో ఇన్నాళ్లు ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్య విధా న పరిషత్ ఉద్యోగులను క్రమంగా బదిలీ చేయను న్నారు. వీరిని శాఖ పరిధిలోని ఇతర ఆస్పత్రులకు బదిలీ చేయనుండగా.. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. మొత్తంగా జిల్లా ఆస్పత్రి నుంచి 199 మందికి స్థానచలనం కలగనుంది. వీరిలో 15 మంది మినిస్టీరియల్ సిబ్బంది, 25మంది నాలుగో తరగతి ఉద్యోగులు, 12మంది ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్ తదితర పారామెడికల్ సిబ్బంది, వంద మంది నర్సింగ్ ఉద్యోగులేకాక 47 మంది వైద్యులు ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరకట్ట..

మున్నేరు బాధితులకు మాజీ ఎంపీ పొంగులేటి పరామర్శ



వరద బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఖమ్మంలోనిమున్నేరుకు ఇరువైపులా కరకట్ట నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలంలోని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన బాధితులతో మాట్లాడారు.జలగంనగర్‌లో వరదలో గల్లంతై మృతి చెందిన సతీష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ మరో మూడు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఆ తర్వాత ప్రజలకు ఈ బాదలు ఉండవని తెలిపారు. బొక్కలగడ్డ ప్రాంతాల్లో తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి బాధితులను పరామర్శించి ఇబ్బందులను తెలుసుకున్నారు. కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మలీదు జగన్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, కొప్పెర ఉపేందర్, బాణాల లక్ష్మణ్, పాలకుర్తి నాగేశ్వరరావు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, ఎండీ.ముస్తఫా, మిక్కిలినేని నరేంద్ర, నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

500మందికి అన్నదానం

ఖమ్మంరూరల్: మున్నేరు వరద బాధిత కుటుంబాల్లో 500మందికి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన శుక్రవారం అన్నదానం ఏర్పాటుచేశారు. పెదతండాలోని జలగంనగర్‌లో బాధితులకు అన్నదానం ఏర్పాటుచేయగా నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, ఏ.అశోక్‌నాయక్, గోనె భుజంగరెడ్డి, ఏనుగు వెంకటరెడ్డి, వెంకటేష్, రమేష్, కర్లపూడి భద్రకాళి, మహేష్‌గౌడ్, రామయ్య పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్, సీపీ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఖమ్మంరూరల్: మున్నేరు బాధితులను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. మండలంలోని పోలేపల్లి పరిధి రాజీవ్‌గృహకల్ప, కరుణగిరిల్లో ఎమ్మెల్సీ మధు, సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి పర్యటించిన ఆయన ముంపు బాధితులతో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ధైర్యం చెప్పారు. యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపడుతున్నందున, ముంపు బెడద తొలగే వరకు పునరావాస కేంద్రాల్లో ఉండాలని సూచించారు. కాగా, ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీపీ బెల్లం ఉమ తదితరులు కూడా ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు.

అర్ధరాత్రి వరకు సహాయక చర్యలు

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల వరకు ఎన్డీఆర్ఎఫ్ బృందంతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మున్నేరు ముంపు ప్రాంతంలో ఆరుగురు చిక్కుకోగా వారిని రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. ఈక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు సీపీ కూడా తెల్లవారుజాము వరకకు పర్యవేక్షించారు.



సహాయక చర్యల్లో ఎన్డీఆర్ ఎఫ్ బృందంతో సీపీ వారియర్

వాన కష్టాలు...



చిన్నారితో ఆస్పత్రికి వస్తున్న మహిళ, బాలింత

ఖమ్మం వైద్యవిభాగం: అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో జిల్లా ప్రజలు అల్లాడిపోతున్నారు. అనారోగ్య సమస్యలతో పెద్దాస్పత్రికి వస్తున్న మహిళలు పడుతున్న బాధ వర్ణనాతీతంగా మారింది. శుక్రవారం ఉదయం కూడా జల్లులు కురవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలతో గొడుగులు పట్టుకుని ఆస్పత్రికి రావడం కనిపించింది.

జావా, యెజ్డీ షోరూం ప్రారంభం



షోరూంలో మంత్రి పువ్వాడకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం మమత ఆస్పత్రి రోడ్డులో జీకే ఆటోమోటివ్స్ ఆధ్వర్యాన జావా, యెజ్డీ షోరూం ఏర్పాటుచేశారు. ఈమేరకు షోరూంను శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. నగర యువత కొత్త మోడళ్ల వాహనాలపై ఆసక్తి చూపిస్తున్న నేపథ్యాన షోరూం ఏర్పాటుచేయడం అభినందనీయమని తెలిపారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంతి, యెజ్డీ నేషనల్ ఎండీ జగదీష్‌శర్మ, షోరూం మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భార్గవ్‌గౌతమ్‌తో పాటు పగడాల నాగరాజు, గుండాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యల్లో విఫలం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మం సహకారనగర్: భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ముందస్తు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో జిల్లాను ఎంతో అభివృద్ధి చేస్తున్నామని చెబుతుండగా.. రెండు రోజుల వర్షంతోనే ఆ అభివృద్ధి బయటపడిందని ఎద్దేవా చేశారు. వర్షసూచనలు ఉన్నా మున్నేటి పరివాహక ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించకపోవడంతో నష్ట తీవ్రత పెరిగిందని చెప్పారు. బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందించాలని, వరి, మిరప నార్లు నష్టపోయిన రైతులకు కూడా సాయం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్, పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు వడ్డే నారాయణరావు, పుచ్చకాయల వీరభద్రం, బాలాజీనాయక్, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కొంటెముక్కల నాగేశ్వరరావు, మలీదు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సైదులు నాయక్, మిక్కిలినేని నరేంద్ర, పాలకుర్తి నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్ పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన బానోతు బాలాజీ నాయక్‌ను నాయకులు సన్మానించారు.

మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్‌లో అల్లర్లను అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్ ఘటన దేశాన్ని కలిచివేసినా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం మహిళల పట్ల ఆ పార్టీ వైఖరి తెలుస్తోందని చెప్పారు. ఇకనైనా కేంద్రం స్పందించి ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించి సాధారణ స్థితి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి



మంగాపురంతండాలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

నేలకొండపల్లి/కూసుమంచి: భారీవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మండలం మంగాపురంతండా, రాయగూడెం గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన పంటలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు అందినకాడికల్లా అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు వర్షంతో కోల్పోయినందున ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అలాగే, కూసుమంచిలో మధుసూదన్‌రెడ్డి మరో కోఆర్డినేటర్ భూక్యా చంద్రకళతో కలిసి మాట్లాడారు. ఈనెల 31న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జరగనున్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమాల్లో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.శేఖర్‌గౌడ్, నాయకులు చిన్నానాయక్, సంతోష్ నాయక్, బాలునాయక్, రాములు, సీతయ్య, శ్రీను, మట్టె గురవయ్య, నాగిరెడ్డి రమేష్‌రెడ్డి, దాసరి వెంకన్న, గోపీగౌడ్, వెంకటేష్, లచ్చానాయక్, బానోత్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

● నిన్న అలా.. నేడు ఇలా!



గురువారం : ముంపునకు గురైన పద్మావతినగర్‌లో ఇళ్లు



శుక్రవారం : నీరు తగ్గడంతో బయటకు తేలిన ఇళ్లు

మున్నేరు వరదతో ఖమ్మంలోని పద్మావతినగర్ ప్రాంతమంతా గురువారం ముంపునకు గురైంది. దీంతో వందలాది ఇళ్లలోకి వరద చేరింది. అయితే, శుక్రవారం ఉదయంకల్లా మున్నేరు వరద తగ్గడంతో పద్మావతి నగర్‌లోని ఇళ్లు బయటకు కనిపించాయి. అయితే, చాలా ఇళ్ల ప్రహరీలు నేలకూలగా, సామగ్రి తడిసి ముద్దయ్యాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఆర్టీసీలో ఉద్యోగులకు పదోన్నతులు

ఖమ్మంమామిళ్లగూడెం: టీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లోని తొమ్మిది మంది కండక్టర్లు, ముగ్గురు డ్రైవర్లు, ఒక మెకానిక్‌కు అసిస్టెంట్ డిపో క్లర్క్‌గా పదోన్నతి లభించింది. ఈమేరకు ఉద్యోగులను ఖమ్మం ఆర్ఎం సీహెచ్.వెంకన్న శుక్రవారం అభినందించి ప్రయాణికులకు మెరుగైన సేవలలందించేలా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు.

ఓసీల్లో సింగరేణి డైరెక్టర్ పరిశీలన

సత్తుపల్లిరూరల్: మండలంలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలను సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యాన బొగ్గు ఉత్పత్తి, రవాణా మొదలు పెట్టాలని ఆదేశించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి, రవాణాపై దృష్టి సారించాలని తెలిపారు. కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజుతో పాటు అధికారులు ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, ఎం.వీరయ్య, రామకృష్ణ,విక్రమ్‌బాబు, మధుసూదన్, శ్రీనివాసరావు, రమణారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం



పరిహారం చెక్కు అందచేస్తున్న ఏడీఈ

పెనుబల్లి: కల్లూరు శాంతినగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసరావు, సుజాత కుమారుడు రానా హుస్సేన్(8) ఇంటి ఆవరణలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై గత ఏడాది ఆగస్టు 21న మృతి చెందాడు. ఈమేరకు విద్యుత్‌శాఖ నుంచి రూ.5లక్షల పరిహారం మంజూరు కాగా పెనుబల్లిలో ఏడీఈ యాదగిరి బాలుడి తల్లి సుజాతకు అందచేశారు. డాక్టర్ లక్కినేని రఘు, సీహెచ్.కృష్ణారావు, డి.కిషోర్‌దత్ పాల్గొన్నారు.

కోళ్లఫామ్‌లోకి వరద

కోళ్లు మృతి, రూ.5 లక్షల మేర నష్టం



ఫామ్‌లో నీరు చేరడంతో చనిపోయిన కోళ్లు

నేలకొండపల్లి: ఎడతెరిపి లేని వర్షాలతో కోళ్ల ఫామ్‌లోకి వరద చేరటంతో వేలాది కోళ్లు మృతి చెందాయి. వివరాలు.. నేలకొండపల్లి మండలం పైనంపల్లికి చెందిన యడవల్లి ఉపేందర్ ఆర్మీలో సర్వేయర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. ఆతర్వాత పింఛన్ డబ్బు రూ.9లక్షలతో నెల క్రితం గ్రామంలో కోళ్ల ఫామ్ ఏర్పాటు చేశాడు. అయితే, వర్షాలతో ఫామ్‌లోకి వరద నీరు చేరగా ఊపిరి ఆడక దాదాపు 2,300 కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీనికి తోడు పది టన్నుల దాణా తడిసిపోగా, మిగిలిన కోళ్లను కుటుంబ సభ్యులంతా కష్టపడి బయటకు తీసుకొచ్చి తక్కువ ధరకు అమ్మేశారు. మొత్తంగా రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు ఉపేందర్ వాపోయాడు.

B.Tech, MBA, ITI, Polytechnic Diploma, @ Low cost. 9642096424

పదోన్నతులు.. పోస్టింగ్

ఖమ్మం సహకారనగర్: పలువురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు రఘునాథపాలెం తహసీల్దార్ జి.నర్సింహా రావుకు పదోన్నతి దక్కగా, ఆయనను నల్లగొండలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్ అండ్ ఆర్(ఎల్ఏ) యూనిట్–2గా నియమించారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ఖమ్మం రూరల్, చింతకాని, తల్లాడ తహసీల్దార్లకు కూడా డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించనుంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.అశోక్ చక్రవర్తికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించటంతో ఆయనను కల్లూరు ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న బి.శివాజీని మైనార్టీ వెల్ఫేర్ శాఖ బదిలీ చేశారు.



గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



సతీష్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న పొంగులేటి

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్‌లో గురువారం రాత్రి మున్నేరు వరదలో కొట్టుకుపోయిన పెంట్ర సతీష్ మృతదేహం శుక్రవారం లభించింది. పెదతండాపరిధిలో ఆయన ఇంటికి సమీపానే మృతదేహాన్ని గుర్తించారు. వరద వస్తుండడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి తెచ్చుకోవడానికి వెళ్లిన సతీష్ తిరిగొచ్చే క్రమాన వరద ఉధృతి పెరగడంతో కొట్టుకుపోయాడు. అయితే, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కొద్దిసేపు వెతికినా చీకటి పడడంతో గాలింపు నిలిపేశారు. ఈమేరకు శుక్రవారం వరద తగ్గాక ఓ చెట్టుకు చిక్కుకున్న ఆయన మృతదేహం లభ్యమైంది. కాగా, సతీష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా సతీష్ కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సాయం అందించి ఓదార్చారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెంలో ఇటీవల పురుగుల మందు తాగిన చెందిన కొమ్ము ప్రభాకర్(34) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభాకర్ జీవితంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

యువతి ప్రేమించడం లేదని ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చింతకాని మండలం నాగులవంచకు చెందిన కొల్లు శ్రీను(22) ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఓ యువతిని ప్రేమిస్తుండగా, ఆమె ప్రేమించటం లేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి చెరువు బజార్‌లో ఉంటున్న తన సోదరుడు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి పడిపోయాడు. దీంతో శ్రీనును ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE
■ యాదాద్రి ఆలేరు ప్లాట్ సైజు 605 చదరపు గజాలు &అంతకంటే ఎక్కువఉన్న రిసార్ట్/వ్యవసాయ భూమి అమ్మకానికి ఉంది. ఆలేరు రైల్వేస్టేషన్ నుండి 3.5 కి.మీ.,వరంగల్ హైవే నుండి 1.7కి.మీ. దూరంలో ఉన్న చ॥ గజం 6999 రూ.Ph:8179622234 [HA-11706]

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ (100% జెన్యూన్) సంప్ర : 945 945 3338 [B-362]

ASTROLOGY
■ విద్య, ఇంటి, వ్యాపార, ప్రేమ వివాహం, ఆరోగ్య సమస్య ఒక్క కాల్‌తో అన్ని సమస్యలకు పరిష్కారము బాబా MS ఖాన్. Hyd. Ph: 9652149253 [H-189270]

WATER PROOFING
■ మీరు వాటర్ లీకేజీ సమస్యలతో బాధపడుతున్నారా? మీ ఇంట్లో స్లాబ్స్ వాటర్‌ట్యాంక్స్ Outside క్రాక్, బాత్‌రూమ్స్ ఏ ఇతర లీకేజీలు అయినా అధునాతనమైన కెమికల్స్‌తో 10 సం॥ గ్యారంటీతో చేయబడును. ఫోన్ : 9966773737 [HA-445]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182
9010299957
కొత్తగూడెం : 9010223783

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.